ఇక్కడకు రావటమే నేను చేసిన తెలిసి తక్కువ పని. స్మిత్ బయటకు వెళ్ళిపోగానే నేను పారిపోయి ఉండాల్సింది. జరిగిన దానికి ఇప్పుడు విచారించి ప్రయోజనం ఏముంది?''

ఆమె మాటలకు తలూపుతూ బ్రీఫ్ కేస్ తెరవబోతూన్న స్కాట్ తల వెనుకగా రివాల్వర్ ఆనించబడింది.

''నీ వొక్కదానివే కాదు అనితా! ఇక్కడకు వచ్చినందుకు స్కాట్ అనే ఈ పెద్దమనిషిగూడ నీతోపాటు విచారించక తప్పదు.''

ఆ కంఠం చాంగ్-యూ-చాంగ్ దని ఇట్టే పోల్చుకున్నాడు మైకేల్ స్కాట్.

# 14

అదో పెద్ద హాలు. గోడలు తడిగా ఉండి నీళ్ళోడుతున్నయ్. నేలమీద గచ్చు చల్లగా ఉంది. గోడల్ని బట్టి అదొక పాడుబడ్డ ఇల్లై ఉండాలనుకున్నాడు నరేంద్ర కుమార్.

అతడి చేతులు వెనక్కువిరిచి మణికట్టుదగ్గర తాళ్ళతో గట్టిగా బంధించారు. కాళ్ళుగూడ అలానే కట్టివేయబడి వున్నాయి చీలమండలదగ్గర. తనతో ఉన్న అనితా గుణవర్ధనే పరిస్థితిగూడ అలానే వుంది.

ఎదురుగా కాలయముడిలా చాంగ్-యూ-చాంగ్ నిలబడి ఉన్నాడు. అతడికి అటూ ఇటూ పదిమంది బలిష్టమైన చైనా నౌకర్లు నిలబడి వున్నారు.

''అటు ఆ డాక్టర్ని, ఈ డేవిడ్ స్మిత్ని ఎలా కడతేర్చాలా అని ఆలోచిస్తున్నాను. ఆ పని నీవే పూర్తిచేసి నా శ్రమ కొంత తగ్గించావ్! మిస్టర్ మైకేల్ స్కాట్! ఓ, సారీ! భారతదేశపు సీక్రెట్ ఏజంట్ మిస్టర్ నరేంద్ర కుమార్!''

తనను బంధించి కళ్ళకు గంతలుకట్టి కారులో ఇక్కడకు తీసుకువచ్చారు. కారు సుమారు ఎంతదూరం ప్రయాణించింది, ఎన్ని మలుపులు తిరిగింది అతడు మనసులోనే అంచనా వేసుకున్నాడు. తను రెండు మూడు మైళ్ళ దూరం కన్న ఎక్కువ ప్రయాణం చేయలేదు. అంటే తనింకా 'కాండీ' నగరంలోనే వున్నాడు. తను పంపిన పోలీసు సి. ఐ. డి. ఏమయాడు?

తన ప్రాణాలు పోయినా ఫర్వాలేదు. ఫార్ములా చైనా వారికి చిక్కకుండా చేయటమే తన ఆశయం! నరేంద్ర కుమార్ మనసు వివిధ ఆలోచనలతో కంప్యూటర్ కన్న వేగంగా ఆలోచిస్తోంది.

"మిస్టర్ చాంగ్! నేను భారతదేశపు గూఢచారినని ఎలా పసిగట్టావు?" నరేంద్రకుమార్ నవ్వుముఖంతో అడిగాడు.

ఎదుట కోపంగా వున్న శత్రువుని ముఖస్తుతితో శాంత పరిస్తే తనకు శిక్ష తగ్గవచ్చు. లేదా తనకు మరణం కొంచెం ఆలస్యంగా రావచ్చు. అది అనుభవం నేర్పిన గుణపాఠం.

చాంగ్ చిరునవ్వు నవ్వాడు. "నారాయణన్ మరణం గురించి నీవు పరిశోధన మొదలెట్టినప్పుడే అనుమానించాను నిన్ను. ఓడలోని అంతమంది జనంలో నా స్వరూపాన్ని ఎవరూ అనుమానించలేదు. నీ వొక్కడివే నా నిజరూపం కనిపెట్టావ్. నేను చాంగ్‌ని కానని పసిగట్టావ్! అప్పుడే నీ తెలివికి మెచ్చుకున్నాను! ఏదిఏమైనా మీ ముగ్గురూ మరికొన్ని గంటల్లో నికృష్టపు చావు చస్తారు!"

అనిత పెద్దగా అరిచింది! "నన్ను వదిలేయండి! నేనే పాపమూ ఎరగను! కేవలం డబ్బుకోసమే స్మిత్ మాటలు విని నా తల ఇందులో దూర్చాను."

"ముగ్గు రెవరు? ఇక్కడ మేమిద్దరమేగా వుంది!"

ఆశ్చర్యంగా అడిగాడు నరేంద్రకుమార్.

నకిలీ చాంగ్ మరోసారి గలగల నవ్వాడు. "అవును సుమా! ఇక్కడ మరో బంధితుడ్ని మీకు పరిచయం చేయడం మరిచాను!" అంటూ తన అనుచరులకు సంజ్ఞ చేశాడు.

నలుగురు మనుషులు ప్రక్క గదిలోకి వెళ్ళి మరో వ్యక్తిని తెచ్చి నేలమీద పడేశారు, బియ్యం మూటను పడేసినట్టుగా.

అతడు షినాయ్. అతడి కాళ్ళూ చేతులూ తమకు మల్లేనే బంధించబడి వున్నయ్.

"ఈ కుక్క మమ్మల్నే మోసగించాలని చూస్తాడా?" చాంగ్ కోపంగా చూశాడు.

"ఇంతకీ నీ నిజస్వరూపమేమిటో చెప్పనేలేదు!"

"నీవు చనిపోతున్నందుకు విచారంకన్న, నేనెవరో తెలుసుకోవాలన్న ఆత్రుత ఎక్కువగా ఉన్నదా? అయితే విను! నా అసలు పేరు ఫాంగ్-ఫూ. నాకు హాంగ్ కాంగ్‌లో వ్యాపారం ఉంది. అది కేవలం నా ఉనికిని కప్పిపుచ్చుకోవటానికి మాత్రమే. వాస్తవానికి నేను చైనాదేశపు ఏజెంట్‌ని. విక్టోరియా నౌకపై చాంగ్ అనే ధనవంతుడు బయలుదేర వలసి ఉంది. అతడ్ని మేమే మాయం చేశాం. నేనే చాంగ్‌గా చలామణి అయాను ఓడలో. ఎందుకో తెలుసా?

"ఫార్ములాకోసం షినాయ్ బయలుదేరాడు. అతడ్ని అనుసరిస్తూ నేనూ సింహాళం వెళ్ళి ఆ ఫార్ములాని చేజిక్కించుకుని ఈ రాత్రి విమానంలో చైనా చేరుకోవాలి. ఆ పని పూర్తయింది. మా పథకానికి అడుగడుగునా అడ్డువస్తున్న మీలాంటి ద్రోహులకి తగిన గుణపాఠం చెప్పి నేను మరో గంటలో కాండీనుంచి బయటపడతాను.

దగ్గరలో వున్న ఎయిర్‌పోర్టునుంచి విమానం ఎక్కుతాను. ఆ తర్వాత ఈ ప్రపంచం అంతా మావో పాలనక్రిందకు వస్తుంది."

"అప్పుడు మావో కూడా హిట్లర్, ముస్సోలినీ, చంఘీజ్‌ఖాన్ మొదలైన వాళ్ళ జాబితాలోకి చేర్చబడతాడు. అవునా?"

ఫాంగ్-ఛూ నవ్వాడు. "మీతో వాదన పెంచుకుని అతివిలువైన కాలాన్ని వృథా చేయలేను. ఈ షినాయ్‌కి మతిభ్రమించేలా, పిచ్చికుక్కగా తయారయే శిక్ష విధిస్తాం! అందుకు నీవూ, ఈమె మాతో సహకరించవలసి వుంటుంది."

"మిస్టర్ ఫాంగ్-ఛూ! నేను ఎలానూ చావబోతున్నాను! నా అనుమానాన్ని నివృత్తి చేస్తే నా విధి సరిగా నిర్వర్తించానని తృప్తిగా మరణిస్తాను!"

"అడుగు నరేంద్రా!"

"షినాయ్ చైనానుంచి తనకు తానుగానే తప్పించుకున్నాడా?"

"లేదు! షినాయ్ పారిపోయేందుకు మేమే అవకాశం కల్పించాం. అతడు ఫార్ములాకోసం సింహళం బయలుదేరటం చూసి మేమూ అతడ్ని అనుసరించాం."

"నారాయణన్ గదిలో టూత్‌పేస్టుని మీరు చేజిక్కించుకున్నారా?"

"అవును. అనితా గదిలో హత్యచేయబడంగానే మా మనుషులు అతడి గది వెతికి టూత్‌పేస్టుని తీసుకున్నారు. అందులో అతడు సేకరించిన సమాచారం వుంది. షినాయ్ ఫార్ములాకోసం వెదుకుతున్నట్టుగా కూడా రాశాడు. అతడు మా పథకానికి పెద్ద అవరోధంలా కనుపించాడు! అందుకే డేవిడ్ స్మిత్‌నీ అనితా గుణశేఖర నీ ఉపయోగించుకుని ఆ అడ్డంకు తొలగించాల్సి వచ్చింది."

"విజయా సేనానాయకే ఏమయిందని?"

"ఆమెను మా ఏజంట్లు కిడ్నాప్ చేసి తెచ్చారు. ఆమెను నానాహింసలు పెట్టి ఫార్ములా చేజిక్కించుకున్నాం. ఆ తర్వాత ఆమెను అంతం చేశాం."

ఫాంగ్-ఛూ తన అనుచరులకు సంజ్ఞ చేశాడు.

"మీ రిద్దరూ మీ అంతం ఎలా జరుగుతుందో కళ్ళారా చూసి ఆనందిద్దురుగాని!" అన్నాడు.

ఫాంగ్-ఛూ అనుచరులు అనితాని చుట్టుముట్టారు. ఆమె ఒంటిమీది గుడ్డల్ని ఊడదీశారు.

మరో నలుగురు లోపల్నుంచి శవపేటికలాంటి గాజు పెట్టెను తెచ్చి నేలమీద వుంచారు.

అనితా ఏడ్పులతో, పెడబొబ్బలతో హాలంతా మారుమ్రోగుతోంది. అయినా ఆ రాక్షసులు చలించకుండా తమ పని చేసుకుపోసాగారు.

అనితా గుణవర్ధనే ఆ గాజు పేటికలో పడుకోబెట్టబడింది. ఆమె లేవటానికి వీల్లేకుండా మెడదగ్గరా, నడుం మీద చెక్కలు బిగించారు. ఆ తరువాత పెట్టె మూత వేసేశారు. ఆమెకు గాలి పీల్చుకునేందుకుగాను తల భాగంలో మూత వేయలేదు.

సీమపంది మాంసాన్ని ఒక ముద్ద తెచ్చి ఆమె కాళ్ళ క్రిందుగా వున్న చివరి అరలో ఉంచారు. మరో ఇద్దరు అనుచరులు లోపల్నుంచి పెద్ద ఎలుకలబోనుని తెచ్చారు. అందులో ఇరవయ్, ముప్పయ్ ఎలుకలు, పెద్దవీ చిన్నవీ ఉన్నవి. వాటిని గాజుపేటికలోని చివరి అరలోకి వదిలారు, చిన్న రంధ్రంగుండా. ఆ తర్వాత రంధ్రాన్ని మూసేశారు.

ఎలుకలు రెండు రోజులనించీ ఆకలికి మాడిపోయి వున్నయ్యేమో సీమపంది మాంసం ముద్దమీదకు ఎగబడి తినసాగినాయి. పదినిముషాల్లో ఆ కాస్త అయిపోతుంది.

ఆకలి తీరని ఎలుకలు పక్క అరలోని మనిషిమీదకు దూకుతాయి. సజీవంగా వున్న ఆ వ్యక్తిని అంగుళం తర్వాత అంగుళం కొరికి తినేస్తవి. ఈ లోపల తనకు జరగబోయేదాన్ని కళ్ళారా చూసి ఊహించిన వ్యక్తి గుండె పగిలి చచ్చిపోనన్నా పోతాడు, లేదా భయంతో మానసిక చిత్రవధ ననుభవించి పిచ్చివాడైపోతాడు. శారీరకంగానూ, మానసికంగానూ చిత్రహింస చేయటానికి చైనీయులు ఉపయోగించే పద్ధతి ఇది.

"ఫాంగ్-ఛూ! ఆమె మీ అందరూ ఆడమన్నట్టు ఆడిందేకాని అంతకన్న ఏ నేరమూ చేయలేదు. ఆమెను వదిలేయండి!"

"ఇక్కడ శిక్షలు విధించేది ఫాంగ్-ఛూ! మైకేల్ స్కాట్ కాదు! అదీగాక ముందుగా ఆమెకే ఎందుకు శిక్ష వేశానంటే, నీవు పొందబోయే సత్కారాన్ని కళ్ళారా చూద్దువుగాని. ఆమె అయిపోయిన తర్వాత నీవు. మీ ఇద్దరి చావులు కళ్ళారా చూసిన షినాయ్ పరిస్థితి ఎంత భయానకంగా వుంటుందో నేను వేరే చెప్పక్కర్లేదు."

షినాయ్ తనతో లోగడ ఒకసారి వాళ్ళు ఎలుకల బోనుల్లో పెట్టి చిత్రహింసలు చేసే పద్ధతి గురించి చెప్పాడు గూడా. ఇప్పుడు ప్రత్యేకంగా తన కళ్ళతో తను చూడాల్సి వచ్చింది, అనుకున్నాడు నరేంద్రకుమార్.

భయంతో గడగడ వణికిపోతున్న షినాయ్ వంక చూసి నవ్వాడు ఫాంగ్-ఛూ వికృతంగా.

"ఈ వినోదాన్ని పూర్తిగా చూసే తీరక లేదు. నేను వెళ్ళిపోతున్నాను. రేపు సాయంత్రం బ్రిటిష్ ఓవర్సీస్ విమానంలో నేను చైనా చేరుకుంటాను ఫార్ములాతో. ఆ

తర్వాత ప్రపంచం అంతా మా వో పాదాల ముందు మోకరిల్లే రోజు త్వరలోనే వస్తుంది."

ఫాంగ్-ఛూ వాకిలిదాకా వెళ్ళి మళ్ళీ వెనక్కు తిరిగాడు. "నా అనుచరులుగూడ బయటికి వెళ్ళిపోతారు. ఒక గంట తర్వాత మళ్ళీ వస్తారు, రెండో మనిషికి మర్యాద చేయటానికి. షినాయ్‌ని గూడ గాజుపేటికలో పెట్టేసిన తర్వాత ఈ కొంప ఖాళీచేసి వచ్చేస్తారు. వాళ్ళ ఆచూకీ గూడ ఎవరూ కనుక్కోలేరు" అని అనితా గుణవర్ధనే వంక చూసి మీసాలు దువ్వుతూ బయటకు వెళ్ళిపోయాడు.

అతడి వెనకనే అతడి అనుచరులుగూడ బయటకు నడిచారు. తలుపుకు బయట ఇనుప బద్దీని బిగించి దానికి తాళాలు వేసినట్టుగా ఊహించాడు నరేంద్రకుమార్ బయటనుంచి వినవచ్చిన శబ్దాన్ని బట్టి.

అనితా గుణవర్ధనే అరుపులు హృదయవిదారకంగా వినవస్తున్నయ్. షినాయ్ భయంతో బిగుసుకుపోతున్నాడు.

నరేంద్రకుమార్ తన దగ్గర చాకుగాని బ్లేడుగాని లేనందుకు చింతించాడు.

"చాకు ఉందా నీ దగ్గర?" షినాయ్‌ని చూసి అడిగాడు.

"లేదు. ఆ రాక్షసులు నా దగ్గరున్న వస్తువులన్నీ లాక్కున్నారు. ఈ ఎలుకల్ని తప్పించుకునేదెలారా దేవుడా?" షినాయ్ శోకం తీశాడు.

నరేంద్రకుమార్ మెదడులో మెరుపు మెరిసింది. ఎలుకలు! ఎలుకలు! ఎలుకలు!

అతడు నేలమీద వెల్లకిలా పడుకున్నాడు. దొర్లుకుంటూ గాజుపేటిక దగ్గరకు చేరాడు. లేచి కూర్చున్నాడు ఒక్క ఊపున. తన చేతులు రంధ్రంలోంచి పోనిచ్చి సీమపంది

మాంసం కేసి రుద్దాడు బాగా. అతని చేతులకు ఉన్న త్రాళ్ల నిండా పందిమాంసం తాలూకు కొవ్వు పులుముకుంది. చెయ్యి ఇంకొంచెం ముందుకు పోనిచ్చాడు. కాని అతడి ఆశ ఫలించలేదు.

ఒక నిముషం అలానే ఉంచాడు. మాంసంముద్దమీదకు ఎగబడుతున్న ఎలుకల్లో ఒకటి చెంగున ప్రక్కకురూకి అతడి చేతులకున్న త్రాళ్ళమీది కొవ్వుకోసం త్రాళ్ళను కొరకసాగింది. ఆ తర్వాత మరో రెండు ఎలుకలు వచ్చాయి! త్రాళ్ళను కొరికే ప్రయత్నంలో ఎలుకలు తన చేతికండలు కొరకకుండా ఉండాలని భగవంతుడ్ని మనసారా ప్రార్థించాడు.

అతడి పథకం పారింది. మాంసంవాసన పసిగట్టి త్రాళ్ళను కొరికివేసినయ్ ఎలుకలు. వెంటనే చేతుల్ని బయటకు తీసేసుకున్నాడు నరేంద్రకుమార్. ఇప్పుడు తన చేతులకు ఎటువంటి బంధాలులేవు. కాళ్ళకున్న త్రాటి ముడిని విప్పుకున్నాడు. అతని చేతిమీద ఒక ఎలుక కొరికిన కారణంగా నెత్తురుకారింది.

ఆత్రంగా లేచి గాజుపేటిక మూతతీశాడు. అనితాను పైకి తీశాడు. అప్పటికి ఎలుకలు ఇంకా ఆమెదాకా రాలేదు. బహుశా స్పృహతప్పిందేమో ఆమె అతని చేతుల్లో తోటకూర కాడలా వాలిపోయింది.

"నరేందర్। నాకట్లు వూడదీయ్ ముందు!" షినాయ్ సంతోషం పట్టలేక అరిచాడు.

"అనితా! భయంలేదు! త్వరగా లే! పారిపోవాలి ఇక్కడనుంచి మనం!" నరేంద్రకుమార్ ఆమెని తట్టి పిలిచాడు. కాని ఆమె శరీరం చల్లగా తగిలింది. ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు. శ్వాస ఆడటంలేదు.

"ఆమెకి భయంతో గుండె ఆగిపోయివుంటుంది! ముందు

నన్ను విడిపించు!'' షినాయ్ మళ్ళీ అరిచాడు.

అనితా దేహాన్ని నేలమీద పడుకోబెట్టాడు నరేంద్ర కుమార్. షినాయ్ దగ్గరకు నడిచి అతడి కట్లు వూడ దీశాడు. షినాయ్ ఆనందానికి అవధులులేవు.

"నరేంద్రా! నేనైతే ప్రాణాల మీద ఆశ వదలు కున్నాను. ఎలాగైతేనేం నీ బుద్ధికుశలత ఉపయోగించి బంధాలు విడదీసుకున్నాం! ఇక మనం బయటపడేదెలాగో చూడాలి!''

"వాళ్లు మళ్ళీ తిరిగి వస్తారుకదా? తలుపు తెరవంగానే మనం వాళ్ళమీదబడి వాళ్ళను హతమార్చి బయట పడదాం!'' నరేంద్రకుమార్ అన్నాడు, తాపీగా.

"వాళ్లు ఇప్పుడప్పుడేరారు. కనీసం ఇంకా రెండుగంట లైనా పడుతుంది. ఈ లోపల మనం ఫాంగ్-ఘూని పట్టు కోవాలి!''

షినాయ్ తలుపు దగ్గరకు వెళ్ళి తలుపుని కుదించి చూశాడు. ఆ హాల్లో ఎక్కడా కిటికీలుగూడ కనబడలేదు.

నేలమీద చెల్లాచెదురుగా పరుగెత్తే ఎలుకల్లో ఒక దానిమీద కాలేసి త్రొక్కాడు షినాయ్ తన తొందర పాటులో.

నరేంద్రకుమార్ పారిపోతున్న ఎలుకలవంక చూశాడు. అవన్నీ డ్రెయినేజ్ పైప్ కన్నంలోకి పరుగెత్తుతున్నయ్. అతడు నేలమీద మోకాళ్ళపై వంగి పరీక్షగా చూశాడు. డ్రెయినేజి గొట్టంమీద మూతపెట్టివున్న ఇనుపమూతను బలంగా లాగాడు. పెద్దకన్నం ఏర్పడింది.

షినాయ్ కంగారుగా చూశాడు. "ఇందులో మనిషి దూరే వెడల్పుగూడ లేదే!'' అన్నాడు.

"ఫర్వాలేదు. ఈ డ్రెయినేజ్ గొట్టం పోయిపోయి పెద్దగొట్టంలో కలుస్తుంది! కనుక మనకు అదే సురక్షిత

మయిన దారి! ఒకవేళ ఈ మురుగుగొట్టాల్లో ప్రాణం పోయినా ఫర్వాలేదు, ఆ ఎలుకల బోనుల్లో హింస అనుభవించేకన్నా!''

ఎలుకలబోను పేరెత్తేసరికి షినాయ్, నరేంద్రకుమార్ వెనుకే డ్రెయినేజ్ గొట్టంలోకి దూకాడు. తన వెనుకనే డ్రెయినేజ్ పైప్ మూతను లాగాడు.

లోపలంతా కటిక చీకటి. దుర్గంధం తల దిమ్మెక్కిస్తోంది. నల్లటి చిక్కటి మురుగు పారుతోంది నరకంలో లావాలాగ. గొట్టంలో మనిషి సరిగ్గా ఇమిడిపోయే దారి మాత్రమేవుంది. నరేంద్రకుమార్ గొట్టంలో పడుకుని ముందుకు పాకిపోతున్నాడు. అతడి వెనుకనే షినాయ్ పాకుతూ వస్తున్నాడు.

నల్లని చిక్కటి మురుగుద్రవం ఒళ్ళంతా అయింది. ఆ తడిమూలంగా నరేంద్రకుమార్ జర్రున తేలికగా ముందుకు జారుతున్నాడు. ఈ దోవ పోయిపోయి మరో పెద్ద గొట్టంలో కలిస్తే తాము అదృష్టవంతులే! లేక అంతకన్న చిన్న గొట్టందగ్గర అంతమయితే, అక్కడే తాము ఆఖరు ప్రార్థన చేసుకోవాల్సివుంటుంది. వెనక్కు తిరిగి పోవటానికి కూడా ఆస్కారం ఉండదు. కానీ ఏమయినా యిదీ పరిస్థితి! అంతకన్న చేయగలిగిందేమీ లేదు. భగవంతుడిమీద భారం వేసి కృతనిశ్చయంతో ముందుకు సాగిపోతున్నాడు నరేంద్రకుమార్.

కాని అప్పటికే లోపలున్న విషవాయువులు అతడి మీద పనిచేయసాగినాయి. అతడితల తిరుగుతోంది. కంటి రెప్పలు బరువుగా వాలిపోతున్నాయి. తన శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుని ముందుకు సాగాడు నరేంద్రకుమార్.

అతడి ఆశలకు విరుద్ధంగా గొట్టం చిన్నదైపోయింది.

ఇందాకట్నుంచి తను తేలికగా పాకాడు. ఇప్పుడు బిగుతైన గొట్టంలోంచి అతిప్రయాసమీద, ఇరుకుదారిన విదిలించుకుపోయేటంత కష్టంగా ముందుకు పోతున్నాడు. ఒంటికయిన మురుగునీరు గ్రీస్‌లాగా పనిచేసి తను గొట్టంలో ఇరుక్కుపోకుండా ఆపుతున్నది. పోయినకొద్ది గొట్టం చిన్నదైపోయి తన శరీరాన్ని వత్తేస్తున్నట్టుగా ఫీలయాడు నరేంద్రకుమార్.

అతడి వెన్నులోంచి భయం ప్రాకింది. పెద్దగా అరవబోయాడు నిస్సహాయంగా. అంతలోనే అతడి కాలికి చేయి తగిలింది. అతడు తమాయించుకున్నాడు. తనతోపాటు మరో వ్యక్తికూడ తను వెళ్ళేదోవనే అనుసరిస్తున్నాడు. తను ధైర్యాన్ని కోల్పోతే తనను అనుసరించి వచ్చే వ్యక్తి బెంబేలు పడిపోతాడు.

"నా వెంటే రా!" అని ముందుకు ప్రాకుతున్నాడు నరేంద్రకుమార్. మళ్ళీ తన మాటకు తనే నవ్వుకున్నాడు. షినాయ్ తనవెంటే రావాలిగాని మరోదారి మళ్ళటానికి త్రోవమాత్రం ఎక్కడుంది?

మరో పదిబారాలు ప్రాకాడు. పెద్దగా వెలుగువచ్చింది. డ్రెయినేజి గొట్టం బాగా పెద్దదయింది. సంతోషంతో ఆ మురుగు నీళ్ళల్లోనే లేచి కూర్చున్నాడు నరేంద్రకుమార్.

దగ్గరలోనే మాన్-హోల్ మెట్లు కనుపించినయ్. షినాయ్‌కి చేయి ఆసరా ఇచ్చి ఇద్దరూ మెట్లు చేరుకున్నారు. ఒకళ్ళ తర్వాత ఒకరు మెట్లెక్కి మ్యాన్-హోలు మూత నెట్టుకుని రోడ్డెక్కారు.

వాళ్ళిద్దరకూ ఎదురుగా హోటల్ ఇంపీరియల్ కనబడింది.

"హేయ్! ఎవరు మీరు?" ఎవరిదో గద్దింపు వినబడి

అటు చూశాడు నరేంద్రకుమార్. రోడ్డు ప్రక్కగా మిలిటరీ జీప్ వుంది. అందులో తను ఇంపీరియల్ హోటల్లో డేవిడ్ స్మిత్ గది వెతికిరమ్మని పంపిన పోలీస్ సి. ఐ. డి. కూడ ఉన్నాడు.

నరేంద్రకుమార్ చేత్తో ముఖంమీది నీళ్లు తుడుచుకున్నాడు. "నేను! నన్ను గుర్తించలేదా?" అన్నాడు సి. ఐ. డి. వంక చూసి.

"మీరా సార్! మిమ్మల్ని మళ్ళీ ప్రాణాలతో చూస్తామని అనుకోలేదు! ఆ దుర్మార్గులు మిమ్మల్నీ బంధించారా? మీకోసమే నగరమంతా మాస్క్వాడ్ వెతుకుతున్నారు!"

"అవును! ఎలాగో సాహసించి, ప్రాణాలకు తెగించి బయటపడ్డాం!"

నరేంద్రకుమార్, షినాయ్‌లను ఎక్కించుకుని మిలిటరీ జీప్ ముందుకు సాగిపోయింది. అప్పుడే తెల్లవారుతోంది. ఫాంగ్-భూని ఆపటానికి బోలెడంత వ్యవధివుంది అనుకున్నాడు నరేంద్రకుమార్.

# 15

కాండీనగరంనుంచి ఎనిమిది మైళ్ళ దూరంలో ఎయిర్ పోర్టు ఉంది. ఫాంగ్-భూ ఎక్కినకారు అసవ్యస్తంగా రోడ్డుమీద నిదానంగా పోతున్నది.

"ఏమిటీ ఆలస్యం! కారుని ఇంకా త్వరగా పోనివ్వలేవూ?" అని ఫాంగ్-భూ డ్రైవర్ మీద విసుక్కున్నాడు.

"రోడ్డంతా రష్గో ఉందిసార్! గతుకులరోడ్ మీద అంతకన్న వేగంగా పోలేం!"

"సరే! ఏడువు!" అని వెనుదిరిగి చూసిన ఫాంగ్-భూ కళ్లు కోపంతో ఎర్రబారినై. వెనకనుంచి శరవేగంతో రెండుకార్లు వస్తున్నాయి. కారు టైర్లు పంచరవుతాయేమో

అనే ఆలోచనగూడ లేకుండా ముందుకు దూసుకువస్తు న్నాయి అవి.

ఫాంగ్-ఛూ అనుమానపడ్డాడు. సీట్లో తన ప్రక్కనే ఉన్న మెషీన్ గన్ తీశాడు. కిటికీలోంచి గన్ బయటకు పెట్టి కాల్చాడు తన వెనుకనే వస్తున్న కార్ల మీదకు. కాని రోడ్ గతుకుల్లో కారు అటూ ఇటూ వూగటం వలన బుల్లెట్స్ మరో దిక్కుగా పోయాయి.

అంతలోనే ఆకాశంలో గద్దల్లా రెండు హెలికాప్టర్లు వచ్చినాయి. అందులోంచి తుపాకిగుండ్లవర్షం కురుస్తోంది ఫాంగ్-ఛూ కారుమీదకు. వెనుకనుంచి వస్తున్న కార్ల లోంచిగూడ కాల్పులు మొదలయినాయి.

మెషీన్ గన్ ని హెలికాప్టర్ కి గురిచూసి కాల్చాడు. హెలికాప్టర్ కి మంటలు అంటుకున్నాయి. చూస్తూండ గానే క్షణాల్లో అది నేలకూలింది. అందులోని మనుషులు వికృతంగా అరుస్తూ క్రిందకు దూకుతున్నారు. దూకే టప్పుడు వచ్చే గాలివిసురుకు వాళ్ళ ఒంటిమీద మంటలు ప్రజ్వరిల్లుతున్నయ్.

ఫాంగ్-ఛూ విజయగర్వంతో నవ్వాడు. అంతలోనే కారు టైర్లకు తుపాకీ కాల్పులవల్ల పంచర్లు అయి కారు కుదుపుతో ఆగిపోయింది.

చేతిలో మెషీన్ గన్ పుచ్చుకుని డోర్ తెరిచి క్రిందకు దిగబోయాడు ఫాంగ్-ఛూ.

అతడి పెనుశరీరంలోకి బుల్లెట్స్ దిగినాయి వానచినుకుల్లా. నేలవాలిపోతూ ఆ కాల్చిన వ్యక్తివంక చూశాడు. అతడు నరేంద్రకుమార్! "నువ్వా? ఎలా తప్పించుకున్నావ్?" ఆశ్చర్యంతో అంటూ అలాగే నేలకూలాడు. అతడి కళ్ళుమాత్రం తెరుచుకునే ఉన్నాయి.

రెండో హెలికాప్టర్ నేలమీద ఆగింది. అందులో

